## క్లుప్తంగా

### వాలీబాల్ జిల్లా జట్టుకు విద్యార్థి ఎంపిక


ఫయాజ్ మాలిక్

గుర్రంపోడు : మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి ఫయాజ్‌మాలిక్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ తెలిపారు. శనివారం నల్లగొండలోని డాన్‌బోస్కో కళాశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ –19 పోటీల్లో ప్రతిభ కనబర్చారు.జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

### బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు రక్షణ చట్టం (అట్రాసిటీ) తీసుకురావాలని కోరుతూ శనివారం హైదారాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు బీసీ సంఘం నేత జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కొంత కాలంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయని, ఏపీ రాష్ట్రం మాదిరిగానే బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో ఎంపీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్ తదితరులున్నారు.

### గ్రంథాలయ అభివృద్ధికి విరాళం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అజ్మాపురం గ్రామంలో గ్రంథాలయానికి దేవరకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్య నారాయణ తండ్రి ముత్యాలు జ్ఞాపకార్థం పుస్తకాల కొనుగోలు కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దేవరకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్య నారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ లయన్స్ క్లబ్ సభ్యులు గాజుల రాజేష్, వనం శ్రీనివాస్, తిప్పర్తి రుక్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### క్లాత్, రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవింద్



హాలియా : ది హాలియా క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం హాలియా పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ది హాలియా క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బూడిద గోవింద్, ప్రధాన కార్యదర్శిగా జంపాల దుర్గారావు, కోశాధికారిగా గాయకవాడ శివన్నారాయణని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### సాగు, తాగు నీరందించాలి

డిండి : డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రజలకు సాగు, తాగు నీటిని పూర్తిస్థాయిలో అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ 8వ మండల మహాసభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యుడు నల్ల వెంకటయ్య, లింగమయ్య, నిరంజన్, బాలయ్య, పార్వతమ్మ, మంజుల, భారతమ్మ పాల్గొన్నారు.

### కౌశిక్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

మిర్యాలగూడ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు దాడి హేయమైన చర్య అని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులు అమానుషంగా దాడి చేశారన్నారు. దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సాయం అందించాలని అడిగితే ఎమ్మెల్యే అని చూడకుండా విచక్షణరహితంగా పోలీసులు దాడి చేయడమేంటని, ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### అట్రాసిటి కేసుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీ వర్గాలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం నల్లగొండకు వచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు ఉద్యోగ సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న బీసీ ఉద్యోగుల హక్కుల రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో జరుగుతున్న జనగణనలో కులగణనను ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించే విధంగా చూడాలని కోరారు. బీసీ వర్గాలకు ఎస్సీ, ఎస్టీ మాదిరిగానే బీసీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని ఆ పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పరమేష్, దశరథనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తూ కృషి చేస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దదేవులపల్లి, కంపాలపల్లి, జి అన్నారం గ్రామాల పరిధిలోని చెరువుల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చిన చేప పిల్లలను మత్స్యకారులతో కలిసి చెరువుల్లో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం చేయడానికి చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సుచరిత, కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, ముత్తయ్య, బహునూతుల నరేందర్, బహునూతుల శ్రీనివాస్, గుండెబోయిన నగేష్ యాదవ్, సింగం వెంకటయ్య, అంబటి రాము, కృష్ణ, వీరాంజనేయులు, సంతోష్, భరత్ రెడ్డి, సైదులు, బాలకృష్ణ, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలంలోని చేపూరు పెద చెరువులో చేపపిల్లలను స్థానిక ఎమ్మెల్యే జవీర్‌రెడ్డి శనివారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార్మికులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. చేపూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల భూ పంపిణీ కోసం గ్రామంలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని వారం రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంజుల, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ముదిరాజ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవి, సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య, మారయ్య, పీఏసీఎస్ చైర్మన్ మాధవరెడ్డి, నాయకులు షేక్ సయ్యద్‌మియా, కట్టెబోయిన విజయ్, పగిళ్ల లాలయ్య పాల్గొన్నారు.


త్రిపురారం : పెద్దదేవులపల్లి చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి


హాలియా : ఇళ్ల స్థలాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

**ఇళ్ల స్థలాల పరిశీలన**

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలంలోని కొంపెల్లి, చిల్కాపురం గ్రామాల్లో పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలాలను శనివారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పరిశీలించారు. మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి హోంశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం కోసం అప్పటి ప్రభుత్వం కొంపెల్లి, చిల్కాపురం గ్రామాల్లోని భూమిని కొనుగోలు చేసి నేటికి పంపిణీకి నోచుకోలేదు. ఇళ్ల స్థలాల కోసం పేదలు పదేళ్లుగా నిరీక్షించిన విషయాన్ని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూమిని ఎమ్మెల్యే పరిశీలించి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ నాయక్, కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుముల అంజి, బద్రినాయక్, గాలి చంద్రకళ, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శంకర్ నాయక్, నారాయణరెడ్డి ఉన్నారు.

# మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మిర్యాలగూడ : రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి మద్దతు ధర రూ.2320 తగ్గకుండా రూ.2420 వరకు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. రైతులు అధికంగా హైబ్రిడ్ సన్నరకం ధాన్యాన్ని పండిస్తున్నారని, మద్దతు ధరకు పైగా చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. రైతులు ధాన్యం నాణ్యత ప్రమాణాలతో తీసుకొస్తే ప్రభుత్వ మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ పొందవచ్చన్నారు. మిల్లుల వద్ద రైతులకు మద్దతు ధర లభించనట్లయితే ధాన్యాన్ని ఆరబెట్టి ఐకేపీ కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధరతోపాటు బోనస్ అందుతుందన్నారు. రైతులు కోత మిషన్లతో వరి పంటను కోయడం వల్ల ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుందని, ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా రైతులు ఆరబెట్టుకోని ఐకేపీ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో 340ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో 38వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.14కోట్లను రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారులను సంప్రదించాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం హరీష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గంటా సంతోష్‌రెడ్డి, బండారు కుశలయ్య తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్

# రేపు జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

డిండి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల)పాఠశాలలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు 10వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 9గురుకుల పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థినులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అండర్‌14, 16, 18 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్‌తో పాటు అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్య అతిథులుగా హాజరువుతున్నారని తెలిపారు. 9 పాఠశాలలకు సంబంధించిన ఆర్‌సీఓలు, డీసీఓలు, పీడీలు, పీఈటీల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆమె వెంట పీడీలు, పీఈటీలు ఉన్నారు.


క్రీడా పోటీలకు ముస్తాబైన మైదానం

# మలబార్ గోల్డ్‌లో నెక్లెస్ మేళా


బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

మిర్యాలగూడ : పట్టణంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ దుకాణంలో శనివారం నెక్లెస్ మేళాను ప్రముఖ గైనకాలజీ వైద్యురాలు సింధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభిరుచికి తగిన విధంగా ఆభరణాలను రూపొందించాలని కోరారు. అదేవిధంగా స్టోర్ హెడ్ సమీర్ మాట్లాడుతూ అధునాతన బంగారు ఆభరణాలను ముందుకు తీసుకురావడంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సంపత్, మహమ్మద్ తౌఫిక్, ప్రవళిక, శ్వేతా, సాయి, జ్యోతి, గృహిణిలు కవిత, అంజమ్మ, చైతన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

మిర్యాలగూడ : మండలంలోని గూడూరు గ్రామంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వ్రతంలో 50 మంది జంటలు పాల్గొనగా ఆలయ పూజారులు వారికి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, చైర్మన్ దైద సంజీవరెడ్డి, సభ్యులు రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గిరిధర్ రావు, మట్టయ్య, సైదులు పాల్గొన్నారు.


సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

## పోషకాహారం అందించాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వేములపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు బాలింతలకు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులుకు పూర్వ పాఠశాల విద్యకు సంసిద్ధులయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోటేశ్వరి, ఎంపీడీవో శారదాదేవి, ఆర్ఐ స్పందన, అంగన్‌వాడీ టీచర్లు రజిత, శోభారాణి, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

# సర్వేలో ఎలాంటి లోపాలూ ఉండకూడదు

మిర్యాలగూడ టౌన్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రజలందరూ సర్వేకు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం పట్టణంలోని ఒకటో వార్డు చైతన్యనగర్‌లో సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మండల తహసీల్దార్ హరిబాబు, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్, ఎన్యూరేటర్ రూపా ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి మండలాల్లో జరుగుతున్న కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సుహాసిని పాల్గొన్నారు.

**సర్వేలో తప్పులకు ఆస్కారమివ్వొద్దు**

కొండమల్లేపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులకు ఆస్కారమివ్వకుండా పకడ్బందీగా చేపట్టాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వాసవి బజారులో ఉన్న 60వ బ్లాక్‌ను దేవరకొండ ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి ఎన్యుమరేటర్లు నింపిన ఫారాన్ని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బాలరాజురెడ్డి, ఎంపీఎస్ఓ వేణుకుమార్, ఏపీఎం శ్రీనివాస్‌యాదవ్, ఆర్ఐ శ్యాంసుందర్ రెడ్డి తదితరులున్నారు.

చందంపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నసమగ్ర కుటుంబ సర్వేలో తపాప్పులకు ఆస్కారం ఇవ్వరాదని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి సూచించారు. నేరెడుగొమ్ము మండంలోని తిమ్మాపురం, నేరెడుగొమ్ము , కొత్తపల్లి గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వేను శనివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. తప్పులు లేకుండా సరి చూసుకోవాలన్నారు. ఆర్ఐ వంశీ, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, అర్షద్ పాల్గొన్నారు.

**ఎన్యుమరేటర్లకు సహకరించాలి**

పెద్దవూర : సమగ్ర సర్వేలో ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకునే ఎన్యుమరేటర్లకు సహకరించాలని తహసీల్దార్ సరోజ పావని అన్నారు. శనివారం మండలంలోని బట్టుగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట ఎన్యూమరేటర్లు జహేదా, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి ఉన్నారు.

**ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి**

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. శనివారం నుంచి పట్టణంలో ప్రారంభమైన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 6వేల966 ఇళ్లను గుర్తించగా 54మంది ఎన్యురేటర్లు సర్వేలో పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**పకడ్బందీగా కుల గణన సర్వే**

త్రిపురారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే మండలంలో 32 గ్రామం పంచాయతీల్లో శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సర్వేకు 11 మంది సూజర్ వైజర్లు, 113మంది ఎన్యుమరేట ర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిసిస్తున్నట్లు ఎంఈఓ రవినాయక్ తెలిపారు.

హాలియా : కుల సర్వేను ఎలాంటి లోపాలు జరుగకుండా నిర్వహించాలని సాగర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్ అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శనివారం హాలియా మున్సిపాలిటీలో ఎన్యూమరేటర్లు చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిండి : ఇంటింటి కుటుంబ సర్వేను సమగ్రవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఆంజనేయులు ఎన్యుమరేటర్లకు సూచించారు. శనివారం ప్రారంభమైన సర్వే మొదటి రోజు డిండి పట్టణంలో పలువురి ఎన్యూమరేటర్ల సర్వే పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకన్న, డిప్యూటీ తహసీల్దార్ గోప్యానాయక్, ఆర్ఐలు నరసింహ, శ్యామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ టౌన్ : ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్


హాలియా : వివరాలు అడుగుతున్న ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్


చందంపేట : నేరెడుగొమ్ములో సర్వేలో పాల్గొన్న ఆర్డీఓ రమణారెడ్డి


దేవరకొండ : ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్


డిండిలో..


కొండమల్లేపల్లిలో..


పెద్దవూరలో..

## పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీసులు రోడ్లపై తిరుగుతున్న వాహనాలతో పాటు వాహనదారులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో ఐదు చోట్ల ఒకేసారి ఆకస్మిక తనిఖీలు చేపట్టగా అకారణంగా ఎలాంటి పని లేకుండా బైక్‌లపై యువకులు తిరుగుతుండటాన్ని గుర్తించామని 42మంది యువకులతో పాటు 32ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అదుపులోకి తీసుకున్న 42మంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చామని మరొకసారి అర్ధరాత్రి ఎలాంటి కారణం లేకుండా రోడ్లపై తిరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ కరుణాకర్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బహుదూర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గానీ రాజా రమేష్ యాదవ్

హాలియా : త్రిపురారం మండల కేంద్రానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హాలియా పట్టణానికి చెందిన గుర్కా బహుదూర్ మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కుందూరు జానారెడ్డి (కేజేఆర్) సోషల్ ఫౌండేషన్ తరపున ఎంపీ రఘువీర్‌రెడ్డి రూ.25వేలు ఆర్థిక సాయంగా ప్రకటించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గానీ రాజా రమేష్ యాదవ్ ద్వారా ఆర్థిక సాయాన్ని శనివారం బాధిత కుటుంబానికి అందించారు. బాధిత కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు మృతుడి పిల్లల ఉన్నత చదువు ఖర్చులకు ఎంపీ రఘువీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అదే విధంగా ఎడమ కాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి మృతి చెందిన బహుదూర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు పంతంగి సోమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ వారు శనివారం హైదరాబాద్‌లో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమయ్య భార్య జ్యోతికి రూ. 20,200లను ఆర్థిక సాయంగా ప్రతినిధి కర్నాటి నరేష్ అందజేశారు. కొంత మంది సభ్యులందరం కలిసి ఒక వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి డబ్బులు జమ చేసి అందించినట్లు తెలిపారు. కష్టాల్లో ఉన్న వారికి ఆదుకునేందుకు తమ వంతు సాయం అందిస్తామన్నారు.

## నాసిరకం చేపపిల్లల పంపిణీపై మత్స్యకారుల ఆగ్రహం

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో తాటి చెరువు, చింతలచెరువులోకి వదిలేందుకు మత్స్యశాఖ అందించిన చేపపిల్లలు నాసిరకంగా ఉండటంతో శనివారం మత్స్య కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసి తిప్పి పంపారు. మూడు ఇంచుల చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా అర ఇంచు, ఒక ఇంచు చేపపిల్లలు ఉండటం, అందులో చనిపోయినవి కూడ ఉండటంతో మత్స్యకార్మికులు చేప పిల్లల పంపిణీని అడ్డుకుని వెనక్కి పంపించారు. 90వేల చేపపిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా మత్స్యకారులు లెక్కించగా కేవలం ఆరువేల చేపపిల్లలు మాత్రమే ఉండటంతో మత్స్యకార్మిక సొసైటీ సభ్యులు మత్స్యశాఖ అధికారి మారయ్యను నిలదీశారు. తమకు నాణ్యమైన చేపపిల్లలను పంపిస్తేనే చెరువులోకి వదిలేందుకు అనుమతిస్తామని మత్స్యకార్మిక సొసైటీ అధ్యక్షుడు బైరబోని నగేష్ పేర్కొన్నారు.

# శిలాఫలకానికే పరిమితమా !

- ముందుకు సాగని స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు
- స్థలసేకరణలో తీవ్ర జాప్యం
- అద్దె భవనంలో సిబ్బంది అవస్థలు

గుర్రంపోడు : మండలకేంద్రంలో స్త్రీ శక్తి భవన నిర్మాణం దశాబ్దకాలంగా శిలాఫలకానికే పరిమితమైంది. స్థల సేకరణ సమస్యతో నిధులు మంజూరైనా భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. 2011లో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో శంకుస్థాపన చేశారు. రూ.25లక్షలు నిధులు మంజూరుకాగా భవన నిర్మాణ పనులు ప్రారంభించడానికి నీటి పారుదల శాఖ నుంచి స్థలం ఇవ్వడానికి అనుమతి లభించాల్సి ఉంది. ప్రభుత్వ స్థలం కావడంతో అప్పటికే ఆ స్థలం పక్కన ఉన్న పోలీసుస్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు అనుమతి లాంఛనమేనని అందరూ భావించారు. అయితే అప్పట్లో మారిన నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు ఏఎమ్మార్పీ చీఫ్ ఇంజనీర్ అనుమతి కూడా అవసరం కావడంతో అనుమతుల్లో తీవ్ర జాప్యం జరిగింది.

**రెవెన్యూ అనుమతులు ఉన్నా..**

ఇటీవల శిలాఫలకం సమీపంలో మరో అనువైన చోట క్యాంపు కాలనీలో 378 సర్వేనంబర్‌లో ఎనిమిది గుంటల స్థలాన్ని సర్వే చేసిన అధికారులు స్థలం లభ్యత ఉందంటూ నివేదిక అందజేశారు. మారిన నిర్మాణ అంచనా వ్యయం ప్రకారం మళ్లీ రూ.35 లక్షలు మంజూరయ్యాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయిలో స్థలాన్ని డీఆర్‌డీఓకు అప్పగించడంలో తీవ్ర జాప్యం జరిగింది.


గుర్రంపోడులో స్త్రీ శక్తి భవన శిలాఫలకం

**సొంత భవనం నిర్మించాలి**



మండల కేంద్రంలో స్త్రీ శక్తి కార్యాలయానికి సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కార్యాలయాన్ని భవిత విద్యావనరుల కేంద్రంలోకి మార్చినా అక్కడ కూడా సరిపడా వసతులు లేవు. సొంత భవనం నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తరి ఉమారాణి,
మహిళా సమాఖ్య నాయకురాలు

**వసతులు లేని భవనం**

ఇటీవల అద్దెభవనంలో విద్యాశాఖ పరిధిలోని భవిత కేంద్రంలో సగ భాగంలో కార్యాలయానికి మార్చారు. కార్యాలయంలో సరైన వసతులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.